

దగ్గు, జలుబుతో ట్రిపుల్ ఐటి విద్యార్థులు సతమతం

ప్రతిరోజూ వంద మంది విద్యార్థులకు చికిత్స

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ట్రిపుల్ ఐటి విద్యార్థులు తీవ్రమైన దగ్గు, జలుబుతో సతమతమవుతున్నారు. ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిరోజూ సుమారు వంద మందికిపైగా అనారోగ్యంతో కళాశాల ఆవరణలోని వైద్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నాలుగైదు రోజులుగా కళాశాలలో ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా విద్యార్థుల అస్వస్థత గురికాకుండా యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరం రెండు రోజులపాటు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెట్టుబడులు కూడా రావాయే..!


రైతులకు నష్టం మిగిల్చిన మొంథా తుపాన్
ముంపుతో తగ్గిన దిగుబడులు
ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు



ప్రజాశక్తి - నరసాపురం, ఆచంట, కాళ్ల


మొంథా తుపాను రైతుల పాలిట శాపంగా మారింది. అప్పు చేసి భారీ పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరి, కాయగూరలు, ఆక్వా పంటలు ఎడతెరిపి లేని వర్షాలకు నీట మునిగాయి. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు. తీరంలో పెద్దఎత్తున బీర, బెండ, ఆనప, దొస, వంగ వంటి పంటలు పండిస్తున్నారు. పంట చేతికొచ్చేసరికి కురిసిన వర్షాలు తీవ్ర నష్టం చేకూర్చాయని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరగా పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి
దేవిరెడ్డి కొండలరావు, వేములదీవి, నరసాపురం మండలం



నేను ఎకరన్నర పొలంలో బీర, ఆనప సాగు చేశా. విత్తనాలు, కూలీ ఖర్చులతోపాటు ఎరువులు, పురుగుమందుల ఖర్చులు కలిపి రూ.లక్ష పెట్టుబడి పెట్టా. దీనికోసం అప్పు చేశాను. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, మొంథా తుపాన్‌తో పంట మొత్తం నాశనమైంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మాకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి
గూడపాటి ప్రసాదరావు, వేములదీవి, నరసాపురం మండలం




నేను రెండున్నర ఎకరాల్లో రొయ్య వేశాను. రొయ్య పిల్ల, మేత, ఇతర ఖర్చులు కలిపి మొత్తం రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టా. మొంథా తుపాను కారణంగా కురిసిన వర్షానికి చెరువు గండి పడి మొత్తం నల్లి క్రీక్‌లో కలిసిపోయింది. అధికారులు పంట నష్టాన్ని గుర్తించి న్యాయం జరిగేలా చూడాలి.

పంట నష్టం తప్పలేదు
సుధాబత్తుల శ్రీనివాస్, కౌలురైతు, ఏలూరుపాడు, కాళ్ల మండలం



ఏడెకరాలు వరి సాగు చేస్తున్నాను. మొంథా తుపాను రీత్యా కురిసిన వర్షాలకు ఉప్పుటేరు నీరు వరి పొలాల్లోకి ఎగదన్నింది. పంట నీట మునిగిపోయింది. సాగు ఖర్చు ఎకరానికి రూ.25 వేలు అయ్యాయి. విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగింది. పొట్ట దశలో ఉన్న వరి పంట దెబ్బతింది. ఎకరాకు ఏడెనిమిది బస్తాల దిగుబడి తగ్గుతోంది. ఈసారి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. వర్షానికి దెబ్బతిన్న పంటలను గుర్తించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

కూరగాయ రైతులను ఆదుకోవాలి
ముత్యాల నారాయణరావు, కౌలురైతు, పెదమల్లం, ఆచంట మండలం




రెండెకరాల పొలాన్ని నలుగురు కలిసి రూ.లక్షకి కౌలుకు తీసుకున్నాం. మూడు లక్షలు పెట్టుబడి పెట్టాం. వాతావరణం అనుకూలించకపోవడంతో వంగ మొక్కలకు చీడపీడలు ఆశించాయి. సాగు చేపట్టి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు దిగుబడి రాలేదు. వంగకు ధర ఉన్నా దిగుబడి లేదు. వాతావరణ మార్పులు పెనుశాపంగా మారాయి. కాయగూరల సాగు కష్టాల సాగుగా మారింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

కౌలురైతులను ఆదుకోవాలి
ఆచంట నాగేశ్వరరావు, కౌలు రైతు, ఆచంట



తుపాన్ ప్రభావంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీట పాలైంది. రెండెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. చివరకు తుపాన్ కారణంగా నష్టం మిగిలింది. కౌలుకు 30 బస్తాలు ఇవ్వాల్సి ఉంది. పెట్టుబడులు రాని పరిస్థితి. ప్రభుత్వమే కౌలు రైతులను ఆదుకోవాలి.

పెట్టుబడులు ఎక్కువ.. ధర తక్కువ
కడలి కుమారస్వామి, కౌలురైతు, కోడేరు ఉత్తరపాలెం, ఆచంట మండలం



ఎన్నో వ్యయప్రయాసాలు పడి దొండ సాగు చేస్తున్నాను. సరైన ధర లేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట తుపాన్ ప్రభావంతో నీట పాలైంది. చివరకు అప్పులు మిగిలాయి. ఎకరంన్నర పొలాన్ని రూ.60 వేలకు కౌలుకు తీసుకుని దొండ పాదులు సాగు చేశాను. దొండ పాదులకు పందిరి వేయడానికి రూ.లక్ష వరకు ఖర్చు చేశాను. ఎరువులు పురుగు మందుల ధరలు అధికంగా ఉన్నప్పటికీ పంటకు మాత్రం మద్దతు ధర రావడం లేదు. దొండ ధర ఆశాజనకంగా ఉన్న తరుణంలో తుపాన్ వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో దిగుబడులపై ప్రభావం పడింది. చివరికి అప్పుల పాలయ్యాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

కనీసం పెట్టుబడులు రాలేదు
కుసుమే నాగేశ్వరరావు, కౌలురైతు కొడమంచిలి టి.మెరక, ఆచంట మండలం



అరెకరం పొలం కౌలుకు తీసుకుని బెండ సాగు చేశాను. వారం రోజులు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి పంట నీట మునిగి కుళ్లిపోయింది. రూ.30 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. కనీసం పెట్టుబడులు కూడా రాలేదు. కమీషన్ వ్యాపారులు పంట చేతికొచ్చే సమయంలో అయినకాడికి కొని రైతులకు మొండిచెయ్యి చూపుతున్నారు. తెగులు సోకి మొక్కలు, ఆకులు చిన్నగా మారి పాలిపోతునట్లుగా ఉంటున్నాయి. దీంతో మొక్కల ఎదుగుదల ఆగిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వమే కూరగాయ రైతులను ఆదుకోవాలి.



సైక్లింగ్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, ఎస్‌పి అస్మీ

ప్రతిఒక్కరూ నడక, సైక్లింగ్‌కు సమయం కేటాయించాలి

ఫిట్ ఇండియాలో కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ నడక, సైక్లింగ్, యోగాకు కొంత సమయం కేటాయించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలన్నారు. 'ఫిట్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా శనివారం విష్ణు కళాశాల వద్ద 'ఫిట్ ఇండియా-సైక్లోథాన్' కార్యక్రమానికి ఆమె జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ విష్ణు కాలేజీ నుండి జువ్వలపాలెం అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ఐదు కిలోమీటర్ల మేర సాగింది. ర్యాలీలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు స్వయంగా సైకిల్ తొక్కి చివరివరకు సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సైకిల్ ర్యాలీ నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో ఒత్తిడికి గురవుతారని, ఒత్తిడిని తగ్గించుకోవడానికి నడక, 2కె రన్, యోగా, సైక్లింగ్ వంటి కార్యక్రమాలను ప్రతినెలా ఒక రోజున నిర్వహిస్తామన్నారు. ప్రతిఒక్కరూ హాజరై తమ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. నడక, సైక్లింగ్ యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని కలెక్టర్ అన్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఎ.రాంబాబు, డిఇఒ ఇ.నారాయణ, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, డిఎస్‌పిలు శ్రీవేద, సత్యనారాయణ, తహశీల్దార్ రావి రాంబాబు, పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, కళాశాలల, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర న్యాయం అందించాలి

పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి శ్రీవేద తనిఖీలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వార్షిక తనిఖీలో భాగంగా పాలకొల్లు రూరల్ స్టేషన్‌ను డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద శనివారం సందర్శించారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, క్రైమ్ వివరాలను సిఐ జి.శ్రీనివాస్‌ను, ఎస్ఐ సురేంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా పోలీసులు వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలన్నారు. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీవేద

కల్తీ మద్యాన్ని అరికట్టాలి

సమస్యలు పరిష్కరించాలని గీత కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతుందని, దానిని వెంటనే ప్రభుత్వం అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్ద గీత కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.కళ్యాణ్‌చక్రవర్తికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో స్పిరిట్‌తో తయారైన మద్యాన్ని విచ్చలవిడిగా గ్రామాల్లో అమ్ముతున్నారని, దీనివల్ల కల్లు అమ్మకాలు పడిపోయాయన్నారు. గీత కార్మికులు పస్తులతో కాలం గడుపుతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు గీత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని తెలుగుదేశం కూటమి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. గీత వృత్తిని ఆధునికీకరించాలని, కల్లు నుండి అనేక పోషక విలువలు గల ఔషధాలు ఉన్నాయని తెలిపారు. కల్లును శీతలపానీయంగా ప్రభుత్వం గుర్తించాలని, కల్లు నుండి నీరా వంటి పానీయాలను ఉత్పత్తి చేయవచ్చునని, ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం చాక్లెట్లు తయారు చేయిస్తూ ఇతర దేశాల నుండి విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తుందని అన్నారు. తాటి ఫెడరేషన్ కు నిధులు కేటాయించి తాటి బెల్లం ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని, గీత కార్పోరేషన్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపడతామని మునిస్వామి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మామిడిశెట్టి నాగభూషణం, నేతలు కాసాని శ్రీనివాస్, కడలి బాలాజీ, కట్టా వెంకటేశ్వరరావు, పాలా సత్యనారాయణ, కంకటాల నాగేశ్వరరావు, పిల్లి ఏడుకొండలు, చిట్టూరి ఆదినారాయణ పాల్గొన్నారు.



ధర్నాలో నినదిస్తున్న కల్లుగీత కార్మికులు

టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుద్ధావతారం రాజు మెమోరియల్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ క్వాలిఫై మ్యాచ్‌లు స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైనట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ జిఎస్‌విఆర్‌ఎస్‌ఎన్.రాజు (బూన్ రాజు) తెలిపారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లలో 82 మంది వెటరన్ క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. నరసాపురంలోని ఆఫీసర్స్ క్లబ్ రెండు కోర్టు, పాలకొల్లు టౌన్ హాలులో ఒక కోర్టు, కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఒక కోర్టులో ఈ పోటీలను సింగిల్స్, డబుల్ విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తేదీ నుంచి మెయిన్ డ్రాకి ఎంపికైన వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 230 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారని రాజు తెలిపారు. వీరందరికీ అల్పాహారంతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలతో పాటు రూ.నాలుగు లక్షల నగదు బహుమతి అందిస్తున్నామని భూన్ రాజు తెలిపారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి..!

వరుస బస్సు ప్రమాదాలతో రెండు జిల్లాల్లో రోడ్ల పరిస్థితి మరోసారి తెరపైకొచ్చింది. ఇక నేవీ ఆయుధ డిపో ఏజెన్సీలోని గిరిజనుల నివాస ప్రాంతాల నడుమ, పచ్చని పంట పొలాల్లో పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష నేతల పర్యటన విజయవంతం కావడం అక్కడి ప్రజలు ఆ డిపోను ఏస్థాయిలో వ్యతిరేకిస్తున్నారనేది ప్రస్ఫుటమైంది. జిల్లాల పునర్విభజనపై అందరిలో ఉత్కంఠ నెలకొంది.

మాటలు కోటలు దాటుతున్నా.. కాలు గడప దాటడం లేదనే చందంగా రోడ్ల అభివృద్ధిపై పాలకుల చేతలున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో ప్రధాన రోడ్లన్నీ జాతీయ రహదారులతో సహా అధ్వానంగా తయారయ్యాయి. మొంథా తుపాన్ ప్రభావం, అంతకుముందు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. వైసిపి ప్రభుత్వం తన పదవీ కాలం ముగిసే సమయంలో కొన్ని రోడ్లు నిర్మించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్రాంతిలోగా రోడ్లపై గుంతలు పూడ్చుతామని, ఆపై రోడ్లన్నింటినీ అభివృద్ధి చేస్తామని గొప్పగా ప్రకటించింది. అయితే ఆచరణలో సంక్రాంతికి కొన్ని ముఖ్యమైన రోడ్లకు మరమ్మతులు చేశారు. అయితే ఆ మరమ్మతుల తీరు సైతం గోతులు పోయి.. గొప్పులు వచ్చాయనే వ్యాఖ్యానాలు సైతం విన్పించాయి. మిగిలిన రోడ్లపై స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి ఎంఎల్‌ఎలు, ఎంపీలు, మంత్రులు అనేక ప్రకటనలు చేసినా వాటికి కనీసం మరమ్మతులు చేసిన నాథుడే కరువయ్యాడు. పైగా వర్షాకాలం ప్రారంభంలో రోడ్ల పక్కన మార్జిన్లలో చేపట్టాల్సిన జంగిల్ క్లియరెన్స్ నిర్వహించకపోవడం, మార్జిన్లలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో రోడ్లపైనే వర్షపు నీరు నిలిచిపోయి పరిస్థితి మరింత దిగజారింది. కొన్ని రోడ్లపై గోతులు తప్ప రోడ్లు కన్పించని పరిస్థితి ఉండగా, మరికొన్ని రోడ్లలో భారీ గోతులు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్త్రీశక్తి పథకం కారణంగా ఆర్‌టిసి బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే తెలంగాణాలోని చేవెళ్ల ఘటన పునరావృతమయ్యే పరిస్థితి ఉందని జనం ఆందోళనకు గురవుతున్నారు. లింగపాలెం ఘటనతో రవాణా శాఖ డొల్లతనం బయటపడింది. ప్రభుత్వ విధానాల ఫలితంగా పర్మిట్లు, లైసెన్స్‌లు మంజూరు చేయడం మినహా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించే పరిస్థితి తగ్గిపోయింది. నిర్వహించినా భారీ లోడులను అడ్డుకోలేకపోవడం, అవినీతి ఇతర కారణాల రీత్యా ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఉండి మండలంలో జరిగిన స్కూల్ బస్సు ప్రమాద ఘటన, లింగపాలెం మండలంలో జరిగిన ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటన రెండింటిలోనూ డ్రైవర్లు మద్యం తాగి ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని సందర్భాల్లోనైనా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లోనూ బ్రీత్ ఎనలైజర్ టెస్టులు నిర్వహించాలని, డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతో అత్యంత సమస్యాత్మకంగా మారిన రోడ్లను అభివృద్ధి చేయాలని జనం కోరుతున్నారు.



ఇక జీలుగుమిల్లి మండలంలో వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో పెట్టేందుకు ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఏజెన్సీలోని చట్టాలను సైతం తుంగలోకి తొక్కుతోంది. పైగా టిడిపి, జనసేన, బిజెపి నేతలు, ఆ పార్టీల ప్రజాప్రతినిధులు సైతం ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడే ఆయుధ డిపో పెట్టి తీరాలనడం వారు ప్రజాభిప్రాయానికి ఏమాత్రం విలువనీయరని మరోసారి తేటతెల్లమైంది. ఈ క్రమంలో వామపక్ష రాష్ట్ర నేతలు ఆయా గ్రామాల్లో పర్యటించగా అక్కడి ప్రజలు నేతలకు ఘన స్వాగతం పలుకడం ద్వారా అక్కడి ప్రజలు డిపోను ఏస్థాయిలో వ్యతిరేకిస్తున్నారో స్పష్టమైంది. పైగా పోలవరం నిర్వాసితులను ఐటిడిఎ పిఒ నేరుగా బెదిరించారనే ఆరోపణలు వెల్లువెత్తడం, పరిహారం సొమ్ములో కమీషన్ కచ్చితంగా ఇవ్వాల్సిందేనని, అది ఎంతివ్వాలనేది అక్కడి కూటమి నేతలతో మాట్లాడుకుని ఫైనల్ చేసుకోవాలని పిఒ నిర్వాసితులను బెదిరించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో తమ భూములిస్తే తమ పరిస్థితి ఇంతేగా అని ఆయా గ్రామాల నిర్వాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనే అటవీ భూములున్నాయని, అక్కడే డిపో పెట్టుకోవాలని గిరిజనులు సూచిస్తున్నారు. అయితే ప్రజాప్రతినిధులు, స్థానిక నేతల కమీషన్ల కోసమే ఈ డిపో విషయంలో మొండిగా ముందుకు సాగుతున్నారనేది తెలుస్తోంది. ఇదే నిజమైతే త్వరలోనే కూటమికి గిరిజనులు గుణపాఠం చెబుతారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

జిల్లాల పునర్విభజనలో లోపాలను సరి చేసే పేరిట కొత్త సమస్యలు తీసుకొస్తున్నారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో కలపడంపై ఎటువంటి భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం లేదు. అయితే గతంలో ఇచ్చిన హామీ మేరకు పోలవరం జిల్లాను ఏర్పాటు ప్రతిపాదనలు లేకపోవడంపై గిరిజనులు, నిర్వాసితులు పెదవి విరుస్తున్నారు. ఒక నియోజకవర్గం అంతా ఒక జిల్లా లేదా రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనే పేరుతో గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలిపే ప్రయత్నాన్ని ఆ మండల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అదే జరిగితే గోపాలపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న ద్వారకాతిరుమల మండలాన్ని తూర్పుగోదావరిలో కలిపేస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా మంత్రివర్గ సమావేశం అనంతరం గెజిట్ వచ్చే వరకూ ఈ చర్చ ఎక్కువ సాగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రభుత్వం కూడా కొత్త సమస్యలు సృష్టించకుండా ఉన్న సమస్యలు పరిష్కరించేలా విభజన చేపట్టాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో చెప్పేదొకటి.. చేసేదొకటి రీతిన కూటమి ప్రభుత్వం అభాసుపాలయ్యే ప్రమాదం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

పరిష్కారం ఊసే లేని..
పిజిఆర్ఎస్..!

'ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామంలో సర్వే నెంబర్ 95/1ఙ1లోని 25 సెంట్ల భూమిని రీసర్వేలో రెవెన్యూ అధికారులు నోషనల్ ఖాతాలో నమోదు చేసేశారు. తన భూమికి పాస్‌బుక్ ఉందని, రీసర్వేలో తప్పుగా నమోదు చేయడంతో మ్యూటేషన్ చేయడం లేదని ఫిర్యాదుదారుడు పిజిఆర్‌ఎస్‌లో అనేకసార్లు ఫిర్యాదు చేశారు. రెండేళ్లుగా సమస్య పరిష్కారం కాని పరిస్థితి. గడువు పూర్తయ్యే వరకూ వేచిచూసి చివరిలో జాయింట్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించడమైందని చెప్పి ముగించేస్తున్నారు. రీఓపెన్ కాకుండా క్లోజ్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. పిజిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయానికి లేఖ రాస్తే జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయానికి పంపించారు. 105 రోజులు గడువు ఇవ్వగా చివరిరోజు జాయింట్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించడమైనది అని చెప్పి ముగించేశారు. సమస్య పరిష్కారం కాక రెండేళ్లుగా బాధితుడు అధికారుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఉంది.'

'నిడమర్రు మండలం ఎనికేపల్లి గ్రామంలో ఒక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా సిమెంట్ రోడ్డుకు గాడికొట్టి తాగునీటి పైప్‌లైన్ మీదుగా మురుగునీటి పైప్‌లైన్ వేశారని, దీనివల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని శ్రీనివాసరావు అనే వ్యక్తి పిజిఆర్‌ఎస్‌లో రెండుసార్లు ఫిర్యాదు చేశాడు. తాగునీటి పైప్‌లైన్ లేని రోడ్డుకు మరోపక్కన మురుగునీటి పైప్‌లైన్ వేసుకునేందుకు అవకాశమున్నా.. అలాకాకుండా తాగునీటి పైప్‌లైన్‌పైనే వేశారు. అధికారులు తాగునీటి పైప్‌లైన్‌పై వేసిన మురుగునీటి పైప్‌ను తొలగించి వేరొక పక్కన వేయించాల్సి ఉండగా తప్పుడు నివేదికలతో రాజకీయ నాయకులకు అనుకూలంగా ఇబ్బంది లేదన్నట్లు ఫిర్యాదు ముగించేశారు. పిజిఆర్‌ఎస్ కార్యాలయం నుంచి ఫోన్ చేయగా ఫిర్యాదును రీఓపెన్ చేసినా ఫలితం లేకుండా పోయింది'.

- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాని సమస్యలు
- గడువు చివరి రోజు ఏదోకటి రాసి ఫిర్యాదు ముగింపు
- భూముల సమస్యల్లో రెవెన్యూ అధికారుల తీరు మరింత దారుణం
- ఫిర్యాదులు రీఓపెన్ కాకుండా అధికారుల జిమ్మిక్కులు
- ప్రతివారం పిజిఆర్‌ఎస్‌లో 300కు పైగా ఫిర్యాదుల నమోదు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న సమస్యలే కాదు.. పిజిఆర్‌ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ఫిర్యాదులు ఇస్తున్న ఫిర్యాదుదారులంతా ఇదేవిధంగా బాధపడుతున్నారు. ప్రతి సోమవారం జరిగే పిజిఆర్‌ఎస్‌లో 300కుపైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఒకవారం ఏదైనా కారణంతో పిజిఆర్‌ఎస్ నిలిచిపోతే తర్వాత వారం 400కుగాపైగా ఫిర్యాదులు వస్తున్న పరిస్థితి నెలకొంది. ఫిర్యాదుల పరిష్కారంపై అత్యంత శ్రద్ధ తీసుకోవాలని జిల్లాలోని అధికారులకు కలెక్టర్ ఆదేశాలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. జనం నుంచి వస్తున్న ఫిర్యాదులను మండల, డివిజన్‌స్థాయి అధికారులు సీరియస్‌గా తీసుకోని పరిస్థితి ఉంది. ఫిర్యాదు తీవ్రతను బట్టి వారం రోజుల నుంచి 105 రోజుల వరకూ గడువు విధిస్తున్నారు. గడువు చివరి వరకూ కాలయాపన చేసి రెండు రోజుల ముందు సమస్యను ఉన్నతాధికారులకు నివేదించడం జరిగిందని, లేకపోతే స్థానిక పరిస్థితికి భిన్నంగా ఎండార్స్‌మెంట్‌లు ఇస్తూ ముగించేస్తున్నారు. ఫిర్యాదుదారులు సంతకాలు చేయకపోతే రిజిస్టర్ పోస్టు ద్వారా ఎండార్స్‌మెంట్‌లు పంపిస్తున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా భూముల సమస్యలపై రెవెన్యూ అధికారులు అత్యంత ఘోరంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్లతరబడి తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో మండలస్థాయిలో తహశీల్దార్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. సమస్య జెసి పరిధిలో చేయాల్సి ఉంటే తహశీల్దార్ జెసి కార్యాలయంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలి. అలాకాకుండా ఉన్నతాధికారులకు నివేదించామని ముగించడం ఏమిటో అర్థం కావడం లేదు. కొంతమంది అధికారులు ఫిర్యాదు మళ్లీ రీఓపెన్ కాకుండా టెక్నికల్ జిమ్మిక్కులు ఉపయోగించి ముగిస్తున్నారు. మళ్లీ జిల్లా కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. దీంతో ఒకే సమస్యపై జనం పదులసార్లు పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఉంటోంది. రోడ్డుకు ఒకవైపు తాగునీటి పైప్‌లైన్ ఉన్నప్పుడు, రెండోపక్కన మురుగునీటి పైప్ వేయడం జరుగుతోంది. అలాకాకుండా తాగునీటి పైప్‌లైన్ లేనివైపు కాకుండా ఉన్నవైపు మురుగునీటి పైప్‌లైన్ వేస్తే అధికారులకు తప్పుగా అన్పించకపోవడం ఏమిటో అర్థం కాకుండా ఉంది. రాజకీయ నేతలు అండగా ఉంటే పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు సమస్యను పరిష్కరించడం లేదు. పైగా ఫిర్యాదుదారులపై బెదిరింపులకు సైతం దిగుతున్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజాప్రతినిధులు నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు జనం క్యూ కడుతున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారమైతే జనం అంతదూరం ఎందుకు వెళ్లాల్సి ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాల్సి ఉంది.

పిజిఆర్‌ఎస్ కార్యాలయం నుంచి తూతూమంత్రంగాఫోన్లు

పిజిఆర్‌ఎస్‌లో చేసిన ఫిర్యాదును ముగించిన తర్వాత ఫిర్యాదుదారులకు పిజిఆర్‌ఎస్ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్న పరిస్థితి ఉంది. తన సమస్య పరిష్కారం కాలేదంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. రీఓపెన్ చేస్తామని సిబ్బంది చెబుతున్నా అతీగతీ ఉండటం లేదు. సిబ్బంది ఎందుకు ఫోన్ చేస్తున్నారో.. ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఒకే సమస్యపై ఫిర్యాదులు రీఓపెన్ అయినప్పుడు అధికారులు ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదో తెలియడం లేదు. పిజిఆర్‌ఎస్ కార్యక్రమం ఒక తంతులా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిజిఆర్‌ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని జనం కోరుతున్నారు.

9న ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం



కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నరసాపురం పట్టణం ఒకటో వార్డు శ్రీహరి పేట కుళాయి చెరువు ఎలిమెంటరీ స్కూల్ వద్ద ఈ నెల తొమ్మిదో తేదీన ఉచిత ఆక్యు పంక్చర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ కొవ్వలి రామ్మోహన్ నాయుడు తెలిపారు. తల, మెడ, మడమ, మోకాళ్ల తదితర దీర్ఘకాలిక నొప్పులు, స్త్రీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు, కొవ్వలి ఫౌండేషన్ నిర్వాహకులు కొండా శ్రీధర్ ఆక్యుపంక్చర్ ఉచిత వైద్యం ద్వారా ఉపశమనం కల్పిస్తున్నారు. నరసాపురం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొవ్వలి రామ్మోహన్ నాయుడు కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9985678881 సంప్రదించాలని సూచించారు.

11న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరుగుతుందని జెడ్‌పి సిఇఒ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.



పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

పైపులైన్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని వాంద్రం గ్రామంలో 40 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్ పూర్తిగా పాడైపోవడంతో మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ పనులను పర్యవేక్షించిన అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ వెనుక వీధిలో పైపులైన్ పాడైపోవడంతో నీరు వృధాగా పోతుందని స్థానికులు తెలియజేయడంతో వెంటనే జెసిబి సహాయంతో పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పైపులైన్‌ను సుమారు 40 ఏళ్ల క్రితం ఏర్పా టు చేయడంతో ప్రస్తుతం భూమికి సుమారు మూడు అడు గుల కింది భాగంలో ఉందని, దీనిని పూర్తిస్థాయిలో మరమ్మ తు చేయాలని, పనులను వేగవంతం చేసి సకాలంలో నీటి సరఫరా చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

వైసిపి పెదమల్లం యూత్ అధ్యక్షులుగా వినయ్

ప్రజాశక్తి - ఆచంట

వైసిపిలో యువత కీలకపాత్ర పోషిస్తుందని ఆ పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షులు కోటే శశిమధు అన్నారు. పెదమల్లం యువజన విభాగం నాయకులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి పెదమల్లం యూత్ అధ్యక్షులుగా మాతా వినయ్‌ను నియమించారు. అనంతరం కోటే శశిమధు మాట్లాడుతూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు వైసిపి బలోపేతంలో భాగంగా యూత్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి వైసిపిలో యువత అధిక పాత్ర పోషించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రొక్కల బన్ను, యూత్ సీనియర్ నాయకులు కొంబొత్తుల దుర్గాప్రసాద్, కోట గిరిధర్, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు బీరా శ్రీను, బోడపాటి సూరిబాబు, దిరిశాల సత్యనారాయణ, నక్కా శ్రీను సతీష్, మాతా గణేష్, మట్టా సన్నీ, తాడి సుధీర్, యడ్ల మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం శ్రీ మదన గోపాల స్వామి ఆలయ ఛైర్మన్‌గా వలవల సావిత్రి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతో పాటు ఎం.దుర్గానాగసాయి అనూష, కె.శ్రీనివాసు, కె.ఉమాసుందరి, ఎస్.లెనిన్‌బాబు, టి.సురేష్‌కుమార్, పి.సత్యనారాయణ, ఎస్.నాగమణి, పి.రాజు, పివిఎల్ఎన్.ఆచార్యులు, బోర్డు సభ్యులను దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఆలయ ఇఒ డి.శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సూచించారు. నూతన కమిటీని మత్స్య శాఖ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మహిళ కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అభినందించారు.

సీతారామలక్ష్మిని కలిసిన ఆలయ ధర్మకర్తలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మిని వీరవాసరం గ్రామంలో వివిధ దేవాలయాలకు నూతనంగా నియమితులైన ధర్మకర్తలు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి 14వ తేదీన నిర్వహించే ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ నూతనంగా నియమితులైన ధర్మకర్తలు ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి వీరవాసరం మండల ప్రధాన కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్, జనసేన మండలాధ్యక్షులు జవ్వాది బాలాజీ, శ్రీ వేణుగోపాల సీతారామస్వామి, కనకదుర్గ, వీరేశ్వర విశ్వేశ్వర సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల నూతన పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రం మెడికల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ పరీక్ష ఫలితాల్లో ఆశ్రం మెడికల్ కళాశాల విద్యార్థులు చక్కని ప్రతిభ ప్రదర్శించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాల్లో ఆశ్రం విద్యార్థిని సి.దేవకి యూనివర్సిటీ స్థాయిలో మూడో ర్యాంక్ సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. అనాటమీ విభాగం నుంచి ఎస్.కార్తికేయ ఏడో ర్యాంక్, సి.దేవకి 9వ ర్యాంక్, ఫిజియాలజీ విభాగం నుంచి దేవకి ఐదో ర్యాంక్, ఎం.లీషామౌన 8వ ర్యాంక్, బి.అశ్వికరెడ్డి పదో ర్యాంక్, బయో కెమిస్ట్రీ విభాగం నుంచి కె.గీతాశివలక్ష్మి ఆరో ర్యాంక్, జి.కౌసల్య 9వ ర్యాంక్, కె.స్నేహ తొమ్మిదో ర్యాంక్, సి.దేవకి పదో ర్యాంక్, శ్రీ చైతన్య పదో ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థుల పట్టుదల, అధ్యాపకుల కృషి ఈ ఫలితాలకు నిదర్శనమన్నారు. విద్యార్థులను, అధ్యాపక బృందానికి ఆశ్రం ఛైర్మన్ గోకరాజు గంగరాజు, డైరెక్టర్ రతీదేవి, ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ అంజిరెడ్డి అభినందించారు.

నేరాలు - ఘోరాలు

కుమారుడు మద్యానికి బానిసయ్యాడని..

ప్రజాశక్తి - మొగల్తూరు

కుమారుడు మద్యానికి బానిసయ్యాడని మనస్తాపానికి గురైన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సంబంధించి మొగల్తూరు హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కెబి.సుబాని తెలిపిన వివరాల ప్రకారం... మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి సీతారామపురం గ్రామానికి చెందిన వాకా సత్యనారాయణ కుమారుడు మద్యానికి బానిసయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన సత్యనారాయణ శనివారం తెల్లవారుజామున మొగల్తూరు కాలువపై ఉన్న బ్రిడ్జిపై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని కుమారుడు వాకా నాగవెంకటకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సఖి సురక్ష శిబిరాలను వినియోగించుకోండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



వైద్య శిబిరంలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సఖి సురక్ష శిబిరాలను పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. శనివారం భీమవరం మున్సిపాలిటీ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ సహకారం, ఇ-వైద్య ప్రయివేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన 'సఖి సురక్ష' వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కుటుంబ శ్రేయస్సు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు 35 ఏళ్లు నిండిన వారికి ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'సఖి సురక్ష' కార్యక్రమం కింద జిల్లాలో మెప్మా పరిధిలోని పట్టణ మహిళల లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంలోని కౌన్సిల్ భవనం మెప్మా విభాగంలో వైద్య శిబిరం నిర్వహించామన్నారు. 9న పాలకొల్లులోని 22వ వార్డులోని కొత్తపేట అర్బన్ కమ్యూనిటీ హాలులో, 11న నరసాపురంలోని మెప్మా భవనంలో వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ వైద్య శిబిరాల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె జబ్బుల ప్రమాదం, పోషకాహార లోపాలు, రక్తహీనత, విటమిన్ లోపం, ప్రోటీన్ లోపం, రొమ్ము, గర్భాశయం, నోటి కేన్సర్ ముందస్తు గుర్తింపు, డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి, కౌన్సెలింగ్ అవసరాలకు సూచనలు, అవసరమైతే ల్యాబ్‌లో పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఆరోగ్యకార్డు కూడా ఇస్తారని, రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా, ఏడాదికి నాలుగుసార్లు టెలీ కన్సల్టేషన్ సేవలు, వైద్య సేవలకు ఆయా ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారని వివరించారు. భీమవరం ఎంఎల్ఎ, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడి వారి ఆర్థిక సుస్థిరత సాధించడమే 'సఖి సురక్ష' ప్రధాన లక్ష్యమన్నారు. ఈ వైద్య శిబిరాల్లో మహిళలు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేయించుకొని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మెప్మా పీడీ హెబ్సిబా, తహశీల్దార్ రావి రాంబాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి, ఇ-వైద్య సంస్థ ప్రముఖ వైద్యులు సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ గ్రేడ్-2 కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో అమలు చేస్తున్న స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో 967 ఇంటి పన్నులకు ఒకే ఫోన్ నెంబర్ నమోదు చేసి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు వేములదీవి వెస్ట్ పంచాయతీ గ్రేడ్-2 కార్యదర్శి పి.ఏసుప్రకాష్‌ను అధికారులు విధుల నుంచి సస్పెన్షన్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు పంచాయతీ విస్తరణాధికారి కె.నాగేంద్రకుమార్ తెలిపారు.

సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్, రోలర్ డిపార్ట్‌మెంట్‌వారి ఉత్తర్వులు అనుసరించి పెనుమంట్ర ఆర్‌జిఎస్ఎ కార్యచరణ ప్రణాళిక 2025-26 గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరుల పెంపుదలపై గ్రామ సర్పంచి, కార్యదర్శులకు మండల స్థాయిలో రెండు రోజులు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజులు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పెనుమంట్ర మండలం ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే శిక్షణా తరగతులకు విధిగా అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.



అన్నం వడ్డిస్తున్న ప్రకాష్‌రావు

మాంటిస్సోరిలో కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి - తణుకు

స్థానిక మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కాలేజీలో శనివారం కార్తీక వనసమారాధనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అనపర్తి ప్రకాష్‌రావు మాట్లాడుతూ కార్తీకమాస విశిష్టత గురించి, వన సమారాధ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొని విజయవంతం చేశారు.

అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో ఉన్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విరాళాలు ఇచ్చిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బండారు వెంకట సత్యనారాయణ నాయుడు, నార్ని రామ్మూర్తి, తాతయ్య, బండారు సోమేశ్వరరావు, రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కార్తీక వనసమారాధ

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ ఆలయ సమీపంలో ఆదివారం మత్స్యకార సంఘీయుల కార్తీక వనసమారాధన ఏర్పాటు చేశామని ఆ సంఘ నాయకుడు నాగిడి రాంబాబు తెలిపారు. దీనికి సంఘీయులు అందరూ కుటుంబ సభ్యులతో కలిసి తరలి రావాలని ఆయన కోరారు.

బస్ స్టేషన్‌లో డిపిటిఒ తనిఖీలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి బస్ స్టేషన్‌ను శనివారం జిల్లా ప్రజా రవాణాధికారి షేక్ షబ్నం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె బస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండ్ ప్రాంగణమంతా దుమ్ము ధూళితో నిండిపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్ స్టేషన్ శుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా చూడాలని అన్నారు. షబ్నం వెంట ఏలూరు డిపో మేనేజర్ వాణి ఉన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం కాళీపట్నం పడమరకు చెందిన కవురు ఆదినారాయణ ఆయన అనుచరులతో జనసేన పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ నాయకత్వ లక్షణాలకు ఆకర్షితులై వైసిపిని వీడి జనసేనలో చేరామని వీరు తెలిపారు. వీరికి బొమ్మిడి నాయకర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామరాజు

ప్రజాశక్తి - నరసాపురం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న రామరాజు

టిడిపి పట్టణ కార్యాలయంలో శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు విని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని తక్షణం పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ వేదిక ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమైక్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, రాష్ట్ర మాజీ మహిళ కమిషన్ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి, సంకు భాస్కర్‌నాయుడు, కొప్పాడ రవీంద్రనాద్ ఠాగూర్, మౌలాలి, మావూరి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు అభినందనీయం

ఎంఎల్ఎ రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి

వికలాంగులకు కృత్రిమ కాళ్లు పంపిణీ



కృత్రిమ కాలు అందిస్తున్న కృష్ణతులసి

ప్రజాశక్తి - తణుకు

మానవత దృక్పథంతో స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి ఆరిమిల్లి కృష్ణతులసి అన్నారు. శనివారం తణుకులో స్థానిక సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలో పిఎన్ఎస్ కిరణ్ ఛారిటబుల్ ట్రస్టు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వికలాంగులకు కృత్రిమ కాళ్లు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణతులసి పాల్గొని మాట్లాడుతూ వికలాంగుల పట్ల స్వచ్ఛంద సేవా సంస్థలు చూపుతున్న ఆదరణ, వారి సేవలు ఎంతో విలువైనవన్నారు. ఒకే వేదికపై సుమారు 60 మందికి కృత్రిమ అవయవాలను ఉచితంగా అందించడం పట్ల ఆమె నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలువ ప్రక్షాళన చేయాలని వినతి



విప్, ఎంఎల్ఎ నాయకులు వినతి అందిస్తున్న రైతులు

ప్రజాశక్తి - నరసాపురం

రుస్తుంబాద మురుగు కాలువకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించడంతో పాటు కాలువను ప్రక్షాళన చేయాలని పలువురు రైతులు కోరారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌కు యర్రంశెట్టివారిపాలెం గ్రామ మాజీ సర్పంచి కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు 300 మందికి పైగా రైతులతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. రుస్తుంబాద నత్తన మురుగు కాలవల్లో గుర్రపు డెక్క, తూడు తొలగింపుతో పాటు పూడిక పూర్తి స్థాయిలో తవ్వాలని, వీటి వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించి మురుగు కాలువలు సక్రమంగా పారుదల జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత ఎనిమిదేళ్లుగా సార్వా, దాల్వా పంటలు ముంపునకు గురి కావడం వల్ల రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు. సుమారు 1250 ఎకరాలకు పైగా రైతులు పంటలు ఊడ్చకపోవడంతో ఆయా రైతులు నష్టాల పాలవుతున్నారని, వారిని ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులకు పరిహారం ప్రభుత్వం పరంగా అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అందే నరేన్, అంకం బన్ను, యడ్లపల్లి తాతాజీ, యడ్లపల్లి వెంకటేష్, కంబాల మామాజీ, దొంగ శ్రీరామచంద్రుడు, అందే కవి, యడ్లపల్లి అర్జునుడు, యర్రశెట్టి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

చెరుకువాడ విద్యార్థులకు జిల్లా ప్రథమ స్థానం

ప్రజాశక్తి - ఉండి



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

వృత్తి నైపుణ్య విభాగంలో జిల్లా స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించడం గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతనాడ అక్బర్ చక్రవర్తి తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన తమ విద్యార్థులు జి.దిలీప్, డి.జోసెఫ్‌రాజు, వి.కేశవఉదయ్, డి.సాత్విక్‌లకు అభినందనలు తెలిపి మాట్లాడుతూ శుక్రవారం భీమవరంలోని చింతలపాటి బాపిరాజు మున్సిపల్ హైస్కూలులో ఎపి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్య విభాగం పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు జిల్లాలోని 35 పాఠశాలల విద్యార్థులతో ఎలక్ట్రానిక్ విభాగంలో పోటీపడి విజయం పొందడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ పోటీల్లో కో-ఆర్డినేటర్‌గా ఎపిసిసి శ్యామ్‌సుందర్, జిసిడి ఒ దీవెనమ్మ వ్యవహరించారని, ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ, సమగ్ర శిక్ష ఎఎంఒ చంద్రశేఖర్, జిల్లా సైన్స్ అధికారి పూర్ణచంద్రరావు, సుబ్రహ్మణ్యం పాల్గొని విజేతలను ఎంపిక చేశారని తెలిపారు. విజేతలుగా నిలిచిన తమ పాఠశాల విద్యార్థులకు, శిక్షణ అందించిన ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ వాసుపల్లి నిశాంత్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నా వ్యాపారాన్ని దెబ్బ తీయాలని చూస్తున్నారు

మహమ్మద్ అలీ ఖాన్ అనే వ్యక్తి ఆవేదన

పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని చెబుతున్న వైనం

ప్రజాశక్తి - నరసాపురం



మాట్లాడుతున్న బాధితుడు మహమ్మద్ అలీ ఖాన్

నరసాపురంలో వైసిపి నాయకులు కొందరు, నా సోదరుడు ఇంతియాజ్ కలిసి కక్షతో నా వ్యాపారాన్ని దెబ్బతీయాలని నాకు జీవనాధారమైన కోర్టులో ఉన్న నా షాపు ముందు, కంకర ఇసుక వేసి ఇబ్బందికి గురి చేస్తున్నారని మహమ్మద్ అలీ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తన షాపు వద్ద మహమ్మద్ అలీ విలేకర్లతో మాట్లాడారు. నరసాపురం నుంచి వేములదీవి వెళ్లే ఆర్అండ్‌బి రహదారిపై దర్గా సెంటర్ వద్ద మటన్ షాపు ముందు ఈ నెల నాలుగో తేదీన వైసిపి నాయకులు అర్ధరాత్రి లారీలతో కంకర ఇసుక తీసుకొచ్చి షాపు ముందు వేశారన్నారు. షాపు ముందు ఉన్న కంకర ఇసుకతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంతో మంది వాహనదారులు రోడ్డుపై పడి గాయాలపాలవుతున్నారన్నారు. ఇప్పటికే పోలీస్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

11న గణపవరం మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 11న గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ కార్యాలయంలో మధ్యాహ్నం 2.30 జరగనున్నట్లు ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. 9వతేదీ నాటికి అధికారులు ప్రగతి నివేదికలు అందజేయాలని తెలిపారు. సమావేశానికి రాని అధికారులు ముందుగా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. మండలంలో ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.